క్లుప్తంగా

పశువులకు ఉచితంగా కట్టు సూదులు

బుచ్చినాయుడుకండ్రిగ: జాతీయ కృత్రిమ గర్భ ధారణ కార్యక్రమంలో భాగంగా ఎదకు వచ్చిన పశువులకు రెండు కట్టు సూదులును ఉచితంగా వేస్తామని ఏడీ మునిరాజ తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ జూలై 31వ తేదీ వరకు ఈ సదుపాయం పశు వైద్యశాలలో అందుబాటులో ఉంటుందన్నారు. బీమా చేసి ఉన్న పశువులకు మాత్రమే ఈ సూదులు వేస్తామని, పాడిరైతులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన తెలిపారు.

పాఠశాలకు డ్రమ్ముల అందజేత



సత్యవేడు: మండల కేంద్రంలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల విద్యార్థులకు తాగునీటి వసతి కోసం రాచపాళెం(పుత్తూరు)కు చెందిన స్వయం కృషి జనహిత స్వచ్ఛంద సేవా సంస్థ 10 తాగునీటి స్టీల్ డ్రమ్ములను వితరణగా అందజేసింది. శనివారం పాఠశాలలో జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో సంస్థ అధ్యక్షుడు పి. భాస్కర్‌రాజు, సెక్రటరీ చెంగల్రాజు, ఎంఈఓ కె.రవి ఆధ్వర్యంలో రూ.20వేలు విలువ చేసే డ్రమ్ములను హెచ్‌ఎం. భారతికి అందజేశారు. వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ కె.సుశీల్ కుమార్ రెడ్డి, సర్పంచ్ మంజుల, ఎంపీటీసీ సభ్యుడు పునిదకుమార్ పాల్గొన్నారు.

ఎమ్మెల్యే పరామర్శ

శ్రీకాళహస్తి: పట్టణంలోని శీతాలాంబ ఆలయం వద్ద నివాసం ఉంటున్న శ్రీకాళహస్తీశ్వరాలయ పాలకమండలి మాజీ సభ్యులు, వైఎస్సార్‌సీపీ నాయకులు నారాయణయాదవ్ సోదరుడు పురుషోత్తం యాదవ్ శనివారం అనారోగ్యంతో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి మృతదేహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. నారాయణయాదవ్ కుటుంబాన్ని పరామర్శించారు. కార్యక్రమంలో పాలకమండలి చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు పాల్గొన్నారు.

వివాహిత ఆత్మహత్య

శ్రీకాళహస్తి: పట్టణంలోని ఓ వివాహిత శనివారం బలవన్మరణానికి పాల్పడింది. కైలాసగిరి కాలనీకి చెందిన భారతి(25) శనివారం ఉరివేసుకుని ఉండగా గుర్తించిన స్థానికులు ఆమె తల్లి సుగుణకు సమాచారం ఇచ్చారు. స్థానికుల సాయంతో భారతి మృతదేహాన్ని కిందకు దించారు. అనంతరం రెండో పట్టణ పోలీసులకు ఫిర్యాదుచేశారు. కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

మెరుగైన వైద్య సేవలు అందించాలి

వరదయ్యపాళెం: రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని తహసీల్దార్ గౌరిశంకర రావు సూచించారు. శనివారం సాయంత్రం చిన్న పాండూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. వైద్యులు, సిబ్బంది హాజరు వివరాలను పరిశీలించారు. అందుబాటులో ఉన్న మందుల వివరాలు, రోజువారీ ఓపీ వివరాలపై వైద్యాధికారిణి లావణ్యతో సమీక్షించారు. గ్రామస్థాయిలో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాన్ని అందుబాటులో తేవాలని తెలిపారు. ఆర్ఐ వేణుగోపాల్, వీఆర్వో చలపతి పాల్గొన్నారు.


గ్రంథాలయాన్ని తనిఖీ చేసిన చైర్‌పర్సన్



రికార్డులను పరిశీలిస్తున్న మధుబాల

తొట్టంబేడు(శ్రీకాళహస్తి రూరల్): మండలంలోని తొట్టంబేడు శాఖ గ్రంథాలయాన్ని శనివారం చిత్తూరు జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ నైనార్ మధుబాల ఆకస్మికంగా తనిఖీ చేశారు. కార్యాలయంలోని అన్ని రికార్డులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం సమీపంలో జరుగుతున్న గ్రంథాలయ భవన నిర్మాణ పనులను పరిశీలించారు. పనులు త్వరగా పూర్తి చేసి భవనాన్ని అందించాలని ఇంజినీరింగ్ అధికారులకు, కాంట్రాక్టర్‌కు సూచించారు. కార్యక్రమంలో తొట్టంబేడు గ్రంథాలయ అధికారి హరికృష్ణ, డిప్యూటీ గ్రంథాలయాధికారి గజేంద్ర, కాంట్రాక్టర్ రమేష్ పాల్గొన్నారు.

పౌష్టికాహారంతో ఆరోగ్యం



వరదయ్యపాళెం: పౌష్టికాహారంతో తల్లీబిడ్డ సంపూర్ణ ఆరోగ్యవంతులుగా ఉంటారని సత్యవేడు ఐసీడీఎస్ ప్రాజెక్టు సీడీపీఓ దేవకుమారి తెలిపారు. పోషణ వారోత్సవాల్లో భాగంగా శనివారం మండలంలోని కంచ రపాళెం అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులు, గర్భిణులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆమె మాట్లడుతూ సంపూర్ణ ఆరోగ్యం కోసం తీసుకోవాల్సిన పోషక పదార్థాల ప్రాముఖ్యతను వివరించారు. సర్పంచ్ బందిల సుజన, వైస్ సర్పంచ్ సుమతి, వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ మండల కన్వీనర్ బందిల సురేష్, అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు, వర్కర్లు పాల్గొన్నారు.

సృజనతోనే ఆవిష్కరణలు

- పలు కళాశాలల నుంచి హాజరైన విద్యార్థులు
- తిరుపతి ఐఐటీలో తిరుత్సవ-2023 వర్క్‌షాప్‌లు

రేణిగుంట: ప్రస్తుత పోటీ ప్రపంచంలో నెట్టుకొచ్చి ముందు వరుసలో నిలవాలంటే మూసధోరణిని విడనాడి వినూత్న ఆలోచనలతో సరికొత్త ఆవిష్కరణల దిశగా మెదడుకు పదును పెట్టాల్సిందేనని శాస్త్ర, సాంకేతిక రంగ నిపుణులు అభిప్రాయపడ్డారు. తిరుత్సవ-2023 పేరిట మూడు రోజుల పాటు జరిగే టెక్నో కల్చరల్ ఫెస్ట్‌కు ఏర్పేడు సమీపంలోని తిరుపతి ఐఐటీ ప్రాంగణం వేదికైంది. ఈ వేడుకల్లో భాగంగా రెండవ రోజు శనివారం బూట్ క్యాంప్‌పేరిట వివిధ కళాశాలల నుంచి వచ్చిన 300మంది విద్యార్థులకు వర్క్‌షాపును నిర్వహించారు. కోడింగ్, డీకోడింగ్ ఎంఎల్, ఏఐ వంటి అంశాలపై అవగాహన కల్పించారు. ప్రధానంగా ఇంటర్వ్యూలు ఎదుర్కొనే సమయంలో ప్రదర్శించాల్సిన నైపుణ్యాలను గురించి వివరించారు. క్రైం బూస్టర్ పేరుతో నిర్వహించిన ఈవెంట్లో హత్య జరిగిన ఘటనకు సంబంధించి క్లూస్ టీము కేసు ఛేదనకు అనుసరించే విధానాలు, వినియోగించే సాంకేతిక పరిజ్ఞానాన్ని డెమోగా ప్రదర్శించారు. జామ్(జస్ట్ ఏ మినిట్) కార్యక్రమం ద్వారా విద్యార్థులు అప్పటికప్పుడు సూచించిన ఒక టాపిక్‌పై ఒక నిమిషం పాటు అర్థవంతంగా మాట్లాడే పోటీలు జరిగాయి. క్రికెట్ ఓ మ్యానియా ఈవెంట్‌లో ఐపీఎల్ తరహాలో 8 టీములుగా విడిపోయి ఆక్షన్‌లో ఉన్న క్రీడాకారులను కొనుగోలు చేసి దక్కించుకునే పోటీలు జరిగాయి. ఆయా జట్లకు ఎన్నికైన క్రీడాకారులు గతంలో వారు ప్రదర్శనల ఫలితాల ఆధారంగా ఉత్తమ జట్టును నిర్ణయించి ప్రైజ్‌మనీ అందజేశారు. ఏస్ ఆఫ్ బార్డర్ ల్యాండ్ పేరుతో నిర్వహించిన పోటీలో 150మంది విద్యార్థులు పాల్గొని ఒక్కొక్కరిని క్విట్ చేసుకుంటూ ఆఖరి రౌండ్‌లో 20మందితో పోటీ పడి తుది ముగ్గురికి నగదు రివార్డును అందించారు. స్పాట్‌లైట్ ఫ్యాషన్ షో ఫైనల్స్ రసవత్తరంగా జరిగాయి. ఢిల్లీకి చెందిన సీలార్డ్ ఎంటర్‌ప్రైజెస్ వారు స్పాన్సర్ చేసిన ఈ కార్యక్రమం ఆకట్టుకుంది. ఇన్‌సైడ్ ఎఫ్‌పీవీ వారు డ్రోన్ల వినియోగం, 3డీలో డ్రోన్‌లో చిత్రీకరించిన ఐఐటీ క్యాంపస్ విహంగ వీక్షణాన్ని ప్రదర్శించారు.



మినీ డ్రోన్ పనితీరును ప్రయోగాత్మకంగా పరిశీలిస్తున్న విద్యార్థి



తిరుత్సవ వేదికపై ఆలపిస్తున్న ఇండియన్ ప్లే బ్యాక్ సింగర్ నిఖిత

విద్యార్థులకు మెలకువలు

పోటీ ప్రపంచంలో ముందు వరుసగా ఉండేందుకు అనుసరించాల్సిన విధానాలకు సంబంధించి జిల్లాలోని పలు ప్రాంతాల నుంచి వచ్చిన ఇంజినీరింగ్ కళాశాలల విద్యార్థులకు వర్క్‌షాప్ నిర్వహించారు. విద్యార్థులు వర్క్‌షాపుల్లో పాల్గొని విలువైన సమాచారాన్ని తెలుసుకున్నారు. పోటీ ప్రపంచంలో రాణించాలంటే అవలంబించాల్సిన విధానాలను, ఇంజినీరింగ్ విద్యతోపాటు కంప్యూటర్, కమ్యూనికేటివ్ స్కిల్స్ గురించి మరింత జ్ఞానాన్ని తెలుసుకున్నారు.

ఆసక్తితో వచ్చా...:



నేను శ్రీసిటీలోని ట్రిపుల్ ఐటీ నుంచి వచ్చా... నేను మా కళాశాలలో క్యాంపస్ అంబాసిడర్‌గా ఇక్కడ ఉత్సవాల్లో పాల్గొన్నాను. తిరుత్సవ పేరుతో ఐఐటీలో నిర్వహిస్తున్న ఈవెంట్లు, కల్చరల్ కార్యక్రమాలు ఎంతగానో వినోదంతోపాటు విజ్ఞానాన్ని పంచుతున్నాయి. వర్క్‌షాపులో కోడింగ్, డీ కోడింగ్, ఎంఎల్, ఏఐ, ఇంటర్వ్యూలను ఎదుర్కొనేందుకు పాటించాల్సిన నియమాలను గురించి ఎంతో విలువైన సమాచారం తెలుసుకున్నా.

–సాయిదీప్తి, ట్రిపుల్ ఐటీ విద్యార్థిని, శ్రీసిటీ

తెలియని విషయాలెన్నో నేర్చుకున్నా



తిరుపతి ఐఐటీలో జరిగిన వర్క్‌షాప్‌కు నేను రేణిగుంట సమీపంలో ఉన్న అన్నమాచార్య ఇంజినీరింగ్ కళాశాల నుంచి వచ్చా.. బీటెక్ సీఎస్ఈ చదువుతున్నా. వర్క్‌షాప్‌లో ఎన్నో తెలియని విషయాలు నేర్చుకున్నా. కోర్సు పూర్తయ్యాక ఉద్యోగం పొందేందుకు కావాల్సిన ప్రమాణాలను పెంపొందించుకునేందుకు నాలో బీజం పడింది. ఇక్కడ మాకు బస చేసేందుకు అత్యున్నత ప్రమాణాలతో కూడిన సౌకర్యాలను, గొప్ప ఆతిథ్యాన్ని ఐఐటీ యాజమాన్యం అందించింది. చాలా సంతోషంగా ఉంది. ఇలాంటి ఈవెంట్లు ఎంతైనా అవసరం.

–కె.చరణ్‌కుమార్, బీటెక్, అన్నమాచార్య ఇంజినీరింగ్ కళాశాల, రేణిగుంట

సమష్టి కృషితో పార్టీ మరింత బలోపేతం

- సంక్షేమ పాలనకు మళ్లీ జగనన్న సీఎం కావాలి
- సైనికుల్లా పనిచేయాలి
- సంక్షేమ పథకాలపై విస్తృత ప్రచారం చేపట్టాలి
- ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం





మాట్లాడుతున్న ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం, హాజరైన సచివాలయ కన్వీనర్లు, ఇన్‌చార్జులు

సత్యవేడు: రానున్న ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ విజయకేతనం ఎగురవేసి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మళ్లీ ముఖ్యమంత్రి అయ్యేలా సమష్టిగా పని చేయాలని ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం పిలుపునిచ్చారు. శనివారం సాయంత్రం పట్టణంలోని వైదేహి కల్యాణ మండపంలో ఏడు మండలాల సచివాలయ కన్వీనర్లు, ఇన్‌చార్జిలు, ఎంపీపీలు, జెడ్పీటీసీ సభ్యులు, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచులతో 'మా నమ్మకం నువ్వే జగనన్న' కార్యక్రమంపై ఎమ్మెల్యే సమీక్షించారు. ఏప్రిల్ 7నుంచి 14 వరకు ప్రతిష్టాత్మకంగా కార్యక్రమం నిర్వహించాలన్నారు. గడిచిన నాలుగేళ్లలో సీఎం జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వంలో ప్రజలకు కలిగిన లబ్ధిని ఇంటింటికీ వెళ్లి వివరించాలని సూచించారు. సంక్షేమం, అభివృద్ధిని తెలియజేసి వారి అభిప్రాయాలను సేకరించాలన్నారు. గ్రామాల్లో ప్రజలకు మరింత చేరువై రానున్న ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ జెండా మరోసారి ఎగిరేలా సైనికుల్లా పనిచేయాలని తెలిపారు. ప్రతి ఒక్కరూ సమన్వయంతో పనిచేస్తూ పార్టీని మరింత బలోపేతం చేయాలన్నారు. టీడీపీ అవాస్తవ ప్రచారాలను తిప్పికొట్టాలని తెలిపారు.

గాంధీజీ కలలుగన్న స్వరాజ్యం

గాంధీజీ కలలుగన్న గ్రామ స్వరాజ్యమే లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పనిచేస్తున్నారని ఎమ్మెల్యే ఆదిమూలం తెలిపారు. ఇందుకు నిదర్శనంగా గ్రామ సచివాలయాలు, వలంటీర్ వ్యవస్థలను ఏర్పాటు చేసి పారదర్శక పాలన అందిస్తున్నారని తెలిపారు. ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాల లబ్ధిని అంకెలతో సహా వివరించాలని పేర్కొన్నారు. గతంలో జన్మభూమి కమిటీల కనుసన్నల్లో అర్హులకు పథకాలు అందలేదని, ప్రతి పథకంలో అవినీతి చోటు చేసుకుందని ఆరోపించారు. నారాయణవనం జెడ్పీటీసీ సభ్యుడు కోనేటి సుమన్ కుమార్, ఎంపీపీ దివాకర్ రెడ్డి, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్లు విద్యానాథరెడ్డి(బీఎన్‌కండ్రిగ), కె.సుశీల్ కుమార్ రెడ్డి(సత్యవేడు), హరిచంద్రారెడ్డి(పిచ్చాటూరు), అపరంజిరాజు(నాగలాపురం), దయాకర్‌రెడ్డి(వరదయ్యపాళెం), రాష్ట్ర కార్యదర్శి భాస్కర్‌నాయుడు, నాయకులు మాస్టర్ స్కూల్ చైర్మన్ చంద్రశేఖర్‌రెడ్డి, బొప్పన సోమశేఖర్, దామోదర్‌రెడ్డి, తిలక్, మాధవి, చిన్నదొరై, తొప్పయ్య తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా పంగుణోత్తర ఉత్సవాలు

నారాయణవనం: మండల కేంద్రంలో టీటీడీ అనుబంధ శ్రీపద్మావతీ సమేత కల్యాణ వేంకటేశ్వర స్వామి ఆలయంలో పంగుణోత్తర ఉత్సవాల్లో వైభవంగా జరుగుతున్నాయి. మూడో రోజు శనివారం శ్రీపద్మావతీ అమ్మవారు ఉయ్యాల సేవలో భక్తులను అనుగ్రహించారు. ఏడు రోజుల ఉత్సవాల్లో రోజూ సాయంత్రం అమ్మవారికి ఊంజల్‌సేవ నిర్వహించనున్నట్లు ప్రధాన అర్చకులు శ్రీధరభట్టాచార్య తెలిపారు. ఉదయం నిత్య కైంకర్యాల అనంతరం అమ్మవారిని ప్రత్యేక తిరుమంజనం నిర్వహించారు. సాయంత్రం అమ్మవారి ఉత్సవర్లను అలంకరించి తిరుచ్చి వాహనంపై ఆలయ అంతర ప్రాకారోత్సవం నిర్వహించారు. తదుపరి ఊంజల్ మండపంలో ఊయలపై కొలువుదీర్చి వేద, నాద, గాత్ర కచ్చేరిల మధ్య ఊయల సేవను నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు, ఆలయ అధికారి నాగరాజు, భరత్, కైలాసం, భద్రతా సహాయ జమేదార్ విజయకుమార్ తదితరులు పాల్గొని పర్యవేక్షించారు.



ఊంజల్‌సేవలో పద్మావతీ అమ్మవారు

5న అమ్మవారికి సన్నిధిలో సుప్రభాతం

ఆలయ ప్రధాన అర్చకులు శ్రీధరభట్టాచార్య మాట్లాడుతూ క్షీర సాగర మథనంలో తమిళ పంగుణి నెల ఉత్తరా నక్షత్రం రోజున ఉద్భవించిన మహాలక్ష్మి విష్ణువు వక్షస్థలంలో కొలువు దీరారని అన్నారు. ఏటా ఉత్తరానక్షత్రం రోజుకు ఏడు రోజుల ముందు నుంచి ఆలయంలో ఉత్సవాలను జరుపుతామన్నారు. ఉత్తరా నక్షత్రం రోజైన ఈనెల 5వ తేదీ రాత్రి భోగశ్రీనివాసమూర్తి పద్మావతీ అమ్మవారి గర్భాలయానికి చేరుకుని శయన సేవలో పాల్గొంటారని తెలిపారు. మరుసటి రోజు గురువారం సుప్రభాత సేవను అమ్మవారి ఆలయంలో నిర్వహించనున్నారు. పద్మావతీ సమేత భోగశ్రీనివాసుడిని మేల్కొలుపు నిర్వహిస్తామని తెలిపారు.

నేడు రాంబట్లపల్లిలో గడప గడపకు

తొట్టంబేడు(శ్రీకాళహస్తి రూరల్): తొట్టంబేడు మండలం కాసారం సచివాలయం పరిధిలోని రాంబట్లపల్లి, ఎస్సీ వాడ, గొట్టిపూడి, కుమ్మరిమిట్ట, గొట్టిపూడి ఎస్సీవాడలో ఆదివారం మధ్యాహ్నం గడపగడపకు మన ప్రభుత్వ కార్యక్రమం నిర్వహించనున్నట్లు వైఎస్సార్ సీపీ మండల ఇన్‌చార్జి బియ్యపు పవిత్రారెడ్డి తెలిపారు. దీనికి శాసనసభ్యులు బియ్యపు మధుసూదన్ రెడ్డి హాజరవుతారని వివరించారు. ఈ కార్యక్రమంలో గ్రామ ప్రజల సమస్యలు తెలుసుకుని వాటిని పరిష్కరించడానికి ఎమ్మెల్యే కృషి చేస్తారని వివరించారు.

ముక్కంటి సేవలో మద్రాస్ హైకోర్టు న్యాయమూర్తి



ఆలయ ధ్వజస్తంభం వద్ద న్యాయమూర్తి ఎస్‌ఎం సుబ్రహ్మణ్యం

శ్రీకాళహస్తి: జ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వరస్వామిని శనివారం మద్రాస్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఎస్‌ఎం సుబ్రహ్మణ్యం కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ఆలయ దక్షిణ గోపురం వద్ద అధికారులు స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. దర్శనానంతరం గురుదక్షిణామూర్తి సన్నిధిలో ఆలయ పండితులు ఆశీర్వదించారు. స్వామి అమ్మవార్ల జ్ఞాపిక, తీర్థప్రసాదాలు అందజేశారు.

4న సామాజిక తనిఖీ సభ

పిచ్చాటూరు: ఈ నెల 4న ఉపాధి హామీ పథకం సామాజిక తనిఖీ బహిరంగ సభ నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ శ్రీనివాసులు తెలిపారు. ఆరోజు ఉదయం 10 గంటలకు ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో జరిగే ఈ సమావేశానికి సంబంధిత శాఖ అధికారులు, ప్రజా ప్రతినిధులు, ఉపాధి కూలీలు తప్పక హాజరుకావాలని ఆయన కోరారు. ఏప్రిల్ 2021 నుంచి మార్చి 2022 వరకు మండలంలో జరిగిన ఉపాధి హామీ పనులకు సంబంధించి సామాజిక తనిఖీ బృందం రెండు వారాల పాటు తనిఖీ నిర్వహించిందని తెలిపారు. ఈ తనిఖీల వివరాలను సభలో వివరిస్తారని పేర్కొన్నారు.

సాగు రైతులకే పట్టాలివ్వాలని వినతి

శ్రీకాళహస్తి రూరల్: మండలంలో సాగుచేసుకుంటున్న రైతులకు పట్టాలు పంపిణీ చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం కార్యదర్శి మించల శివకుమార్ డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం తహసీల్దార్ కార్యాలయానికి వెళ్లి తహసీల్దార్ జరీనాకు వినతి పత్రం అందజేశారు. ఆయన మాట్లాడుతూ గత ఇరవై సంవత్సరాలుగా మండలంలో కొంత మంది నిరుపేదలు చెట్టుపుట్ట కొట్టుకుని నేలను చదునుచేసుకుని, సాగు చేసుకుంటున్నారని చెప్పారు. అయితే వారికి ఇప్పటికీ పట్టాలు మంజూరు చేయలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఉడమలపాడు పంచాయతీ పరిధిలోని శెగలమిట్ట దళిత కాలనీకి చెందిన రాధాకృష్ణయ్య గత 20 ఏళ్లుగా సాగుచేసుకుంటున్న భూమిని రెవెన్యూ అధికారులు బడా భూస్వామికి పట్టా చేయటం దారుణమని ఆవేదన వ్యక్తం చేశారు. రెవెన్యూ అధికారులు పరిశీలించి తగు చర్యలు తీసుకోకపోతే ఆందోళన చేపడుతామని హెచ్చరించారు.



తహసీల్దార్‌కు వినతి పత్రం ఇస్తున్న నాయకులు

చెట్టంత నిర్లక్ష్యం.. పొంచి ఉన్న ప్రమాదం

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలోని, ఆర్‌అనంతాపురం, కమ్మవారికండ్రిగ గ్రామాల్లో తాగునీటి మోటారు స్టార్టర్ బాక్సులతో ప్రమాదం పొంచి ఉంది. కమ్మవారికండ్రిగలో తాగునీటి మోటార్ స్టార్టర్ బాక్సును మూడు అడుగుల ఎత్తులో ఉన్న చెట్టుకు, ఆర్ అనంతాపురం గ్రామంలో రాయికి అమర్చి ఉన్నారు. బాక్సులకు మూతలు లేవు. దీంతో చిన్న పిల్లలకు, పశువులకు షాక్ కొట్టే ప్రమాదం ఉంది. కమ్మవారికండ్రిగలో చెట్టుకు అమర్చి ఉన్న స్టార్టర్‌తో ఎర్త్ అయ్యే ప్రమాదం ఉంది. స్టార్టర్ బాక్సులలోని వైర్లు బయటకు వచ్చి ఉన్నాయి. ప్రమాదం పొంచి ఉందని పలుమార్లు అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని గ్రామస్తులు పేర్కొంటున్నారు. ప్రమాదాలు చోటు చేసుకోక ముందే అధికారులు స్పందించాలని ఆయా ప్రాంతాల రైతులు కోరుతున్నారు.



కమ్మవారికండ్రిగలో చెట్టుకు అమర్చిన స్టార్టర్ బాక్సు

వేడుకగా వసంతోత్సవం



ఉత్సవమూర్తులకు అభిషేకం

వరదయ్యపాళెం: మండలంలోని పెద్ద పాండూరులో వెలసిన శ్రీ సీతా సమేత కోదండరామస్వామి ఆలయంలో నవమి ఉత్సవాల్లో భాగంగా శనివారం వసంతోత్సవం వేడుకగా నిర్వహించారు. ఉదయం స్వామివారికి ప్రత్యేక పూజలు, పంచామృతాభిషేకాలు చేపట్టారు. అనంతరం వసంతోత్సవంలో భాగంగా సుగంధ ద్రవ్యాలతో అభిషేకం చేశారు. రాత్రి కోదండరామస్వామి ఉత్సవమూర్తులను పెద్ద పాండూరు పురవీధుల్లో ఊరేగించారు. చుట్టుపక్కల గ్రామాల నుంచి భక్తులు తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయ ప్రధాన అర్చకులు నిరంజనాచార్యులు తీర్థప్రసాదాలను అందజేశారు.

అంగన్‌వాడీ ఉద్యోగులకు నియామక పత్రాలు

శ్రీకాళహస్తి రూరల్: నియోజకవర్గంలోని గ్రామాల్లో ఖాళీగా ఉన్న అంగన్‌వాడీ కేంద్రాల కార్యకర్తలకు, సహాయకులకు శ్రీకాళహస్తి పట్టణంలోని ఎమ్మెల్యే కార్యాలయంలో శనివారం ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి చేతుల మీదుగా నియామక పత్రాలను అందజేశారు. శ్రీకాళహస్తి మండలం బీవీపురం అంగన్‌వాడీ కేంద్రం కార్యకర్తగా బొడ్డు విమల, చుక్కలనిడిగల్లు మినీ అంగన్‌వాడీ కేంద్రం కార్యకర్తగా ఎస్.కృష్ణమ్మ, చల్లపాళెం అంగన్‌వాడీ కేంద్రం సహాయకులుగా ఎస్.స్వాతి, శ్రీకాళహస్తి పట్టణంలోని కైలాసగిరి కాలనీ, వీఎంపల్లి అంగన్‌వాడీ కేంద్రాల సహాయకులుగా ఎమ్.పద్మ, కే.మౌనికకు నియామక పత్రాలు అందజేశారు.

తొట్టంబేడు మండలంలోని పెద్ద కన్నలి, శివనాథపురం, విరుపాక్షపురం అంగన్‌వాడీ కేంద్రాల కార్యకర్తలుగా కె.రజిత, జె.అర్చన, పి.సుగుణ, కాసరం, గుండేలుగుంట, కొణతనేరి, కొత్తకండ్రిగ, పెద్దశింగమాల అంగన్‌వాడీ కేంద్రాల సహాయకులుగా పార్వతి, సంధ్య, రవణమ్మ, మంజుల, ముత్యాలమ్మలకు నియామక పత్రాలను అందజేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాల్లో ఖాళీలు ఏర్పడిన వెంటనే వాటిని భర్తీ చేస్తున్నామని అన్నారు. ప్రతి ఒక్కరూ క్రమం తప్పకుండా అంగన్‌వాడీ కేంద్రాలకు వెళ్లి సమర్థవంతంగా విధులు నిర్వహించాలని సూచించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ కాపిరెడ్డి వెంకటసుబ్బారెడ్డి, ఊటా రమేష్‌యాదవ్, రవిశేఖర్‌బాబు, రంగినేని చెంచయ్యనాయుడు, వెంపల్ల సురేంద్రయాదవ్, చుక్కల కిరణ్, భక్తవత్సలం, సీడీపీవో శాంతిదుర్గ పాల్గొన్నారు.



బీవీపురం అంగన్‌వాడీ కార్యకర్తకు నియామక పత్రాన్ని అందిస్తున్న ఎమ్మెల్యే

వైఎస్సార్‌సీపీతోనే రాష్ట్రాభివృద్ధి



సంక్షేమ పథకాలపై గ్రామస్తులకు వివరిస్తున్న ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి

తొట్టంబేడు(శ్రీకాళహస్తి రూరల్): వైఎస్సార్ సీపీతోనే రాష్ట్రం అభివృద్ధి చెందుతోందని ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్ రెడ్డి అన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా శనివారం సాయంత్రం ఆయన మండలంలోని కాసారం కొత్త ఎస్సీవాడ, కొండ్రాజు పల్లి, అరుంధతివాడ, గొట్టిపూడి, ఎస్టీ కాలనీలో జోరుగా పర్యటించారు. ఎమ్మెల్యేకు మహిళలు పెద్ద ఎత్తున మంగళ హారతులు, గజమాలతో ఘనంగా స్వాగతం పలికారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్రాభివృద్ధి వైఎస్సార్‌సీపీతోనే సాధ్యమని ప్రతి కుటుంబానికి నవరత్నాల ద్వారా అన్ని సంక్షేమ ఫలాలు అందుతున్నాయని తెలిపారు. ప్రతి కుటుంబానికీ నేరుగా సంక్షేమ ఫలాలు అందుతున్నాయన్నారు. పార్టీలకు అతీతంగా సంక్షేమ ఫలాలు అందరికీ అందించనున్నట్లు తెలిపారు. సమస్య ఏదైనా ఉంటే పట్టణంలోని ఎమ్మెల్యే పార్టీ కార్యాలయానికి నేరుగా రావచ్చని ప్రజలకు తెలిపారు. గ్రామంలో ప్రతి ఒక్కరినీ ఆప్యాయంగా పలకరిస్తూ అన్ని సంక్షేమ పథకాలు అందుతున్నాయని ఆరా తీశారు. గ్రామంలో ప్రధానంగా డ్రైనేజీ సమస్య, కొంత మంది పింఛన్ల రద్దుపై ఎమ్మెల్యేకు ఫిర్యాదు చేయగా వెంటనే స్పందించిన ఆయన వాటిని పరిష్కరించాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు ఉన్నం వాసుదేవనాయుడు, తిరుపతి జిల్లా సేవాదళ్ అధ్యక్షులు కాపిరెడ్డి ఢిల్లీబాబు రెడ్డి, జెడ్పీటీసీ అర్చనాదేవి, మునిరత్నం, వైస్‌ఎంపీపీ గెరటారెడ్డి, తహసీల్దార్ సుధీర్‌రెడ్డి, ఎంపీడీవో తరుణాక్షిరెడ్డి, గంగాధరం, సర్పంచ్ వెంకటేష్, ఎంపీటీసీ గురుమూర్తి, నాయకులు పాల్గొన్నారు.

మహిళను లక్షాధికారి చేయడమే లక్ష్యం

రేణిగుంట: ప్రతి మహిళను లక్షాధికారిగా చూసి ఆర్థిక విప్లవానికి నాంది పలకాలన్నదే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి లక్ష్యమని శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి అన్నారు. వైఎస్సార్ ఆసరా వారోత్సవాల్లో భాగంగా మండలంలోని ఆర్.మల్లవరం హైస్కూల్ ఆవరణలో జరిగిన సభలో ఆయన రేణిగుంట, ఏర్పేడు మండలాలకు చెందిన మహిళలకు ఆసరా చెక్కులను పంపిణీ చేశారు. ఆసరా సంబరాల్లో భాగంగా తొలుత మహిళలు ముఖ్యమంత్రి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్రంలో మహిళల సంక్షేమం కోసం జగనన్న అనేక సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తున్నారన్నారు. నవరత్నాలలోని అన్ని పథకాలు అక్క, చెల్లెమ్మల పేరుతోనే అందిస్తున్నారని గుర్తుచేశారు. గత ప్రభుత్వంలో చంద్రబాబు నాయుడు డ్వాక్రా రుణాలను మాఫీ చేస్తానని నమ్మించి గద్దెనెక్కి మహిళలను వంచించారని చెప్పారు. ఎన్నికలకు ముందు పసుపు, కుంకుమ అంటూ మహిళలను దగా చేశారన్నారు. నియోజకవర్గంలో 30 ఏళ్ల అధికారంలో ఉన్న వ్యక్తి అభివృద్ధిని పూర్తిగా విస్మరించి గెలిచి హైదరాబాద్లో కూర్చున్నారని విమర్శించారు. తాను ఎమ్మెల్యేగా గెలవకముందే నియోజకవర్గంలో అనేక సేవా కార్యక్రమాలను చేపట్టానన్నారు. ఎమ్మెల్యేగా గెలిచాక నిత్యం ప్రజల్లో ఉంటూ, తనకు తోచిన విధంగా అనేక సేవా కార్యక్రమాలను చేస్తున్న విషయాన్ని గుర్తు చేశారు. ముఖ్యమంత్రి జగనన్న విలువలతో కూడిన రాజకీయాలు చేస్తున్నారని తెలిపారు. అనంతరం డ్వాక్రా మహిళలకు వైఎస్సార్ ఆసరా చెక్కులకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో రేణిగుంట మండల ఇన్‌చార్జి బియ్యపు పవిత్రారెడ్డి, రాష్ట్ర కార్యదర్శి ఓడూరు గిరిధర్‌రెడ్డి, ఏర్పేడు మండల ఇన్‌చార్జి గున్నేరి కిషోర్‌రెడ్డి, ఎంపీపీ కలపాటి హరిప్రసాద్ రెడ్డి, జెడ్పీటీసీలు టి.సంధ్య, తిరుమలయ్య, వైస్ ఎంపీపీలు సుజాత, జమళ్ల శ్రీను యాదవ్, జనార్దన్ రెడ్డి, సింగిల్‌విండో అధ్యక్షులు జనార్దన్‌యాదవ్, గణేష్‌రెడ్డి, జువ్వల దయాకర్‌రెడ్డి, రమణయ్యయాదవ్, మన్యం శ్రీనివాసులురెడ్డి పాల్గొన్నారు.



సీఎం చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న మహిళలు

పరీక్ష సామగ్రి వితరణ

బుచ్చినాయుడుకండ్రిగ: మండల కేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు శనివారం బీఈపీసీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ప్రధానోపాధ్యాయురాలు విజయకుమారి పరీక్ష సామగ్రిని వితరణగా అందజేశారు. ఆమె మాట్లాడుతూ బాగా చదివి మంచి మార్కులు తెచ్చుకుని తల్లిదండ్రులకు, పాఠశాలకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. ఎస్సీ హాస్టల్ వార్డెన్ రవి, సంస్థ సభ్యుడు రియాజ్, ఉపాధ్యాయులు శ్రీనివాసులు, తదితరులు పాల్గొన్నారు.

కేవీబీపురం: పదోతరగతి పరీక్షలు రాయనున్న సుమారు 300 మంది బాలికలకు బీఎస్పీ నేతలు పరీక్ష సామగ్రిని వితరణగా అందించారు. రాజులకండ్రిగ, కేవీబీపురం, అంజూరు తదితర గ్రామాలకు చెందిన విద్యార్థినులకు బహుజన సమాజ్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు పరశురాముడు చేతుల మీదుగా శనివారం సామగ్రిని అందజేశారు. దళిత నేతలు నవీన్, శివయ్య, వినోద్, లతీష్, రఘు, మునస్వామి, గిరి పాల్గొన్నారు.



కేవీబీపురం: పరీక్ష సామగ్రి అందుకున్న విద్యార్థులు